# ఓ పువ్వు రాలిపోయింది

ఇంటిముందర గున్నమామిడిచెట్టు ఆకు కనబడకుండా పూత పెట్టింది. చూసినవాళ్లందరూ, దాని అందానికి పచ్చదనానికి, మురిసిపోయేవాళ్ళే! ఇంటిగలవాళ్ళు యింక ఫరవాలేదు కాపు కాస్తుంది అని సంబర పడజొచ్చారు.

యింటి యజమాని కుటుంబరావుకి మాత్రం ఆ కాపు కొచ్చిన చెట్టుపై ఎవరి దృష్టి అయినా పడుతుందేమోనన్న భయం లోలోపల లేకపోలేదు!

సరదాలూ, భోగాలు, ఏనాడో మరిచిపోయి, నిరాశా, నిస్పృహలూ నీటని ఎదుర్కొనడంలో విసుగూ, కోపం, అలవాటయిపోయినా యీనాడు అవన్నీ మరిచిపోయి - ఏ మూల నుండో సంతోషం తెచ్చుకొని పంచుకొంటున్నది అతని భార్య.

ఏదో పంకని యింట్లో ఎప్పుడూ వాదనలూ, కేకలూ, నీటితో ఒకరి మొహాలొకరు- నవ్వుతూ చూసి ఎరగని ఆ యింట్లో కాలు పెట్టడానికే భయపడినా, తప్పని సరిగా సర్కస్‌కేజ్ లోకి పోయే రింగ్ మాస్టర్‌లా, చేరుకున్నాడు పురుషోత్తమరావు.

ఆ రోజు ఆ ఆనందానికి కారణం తనకూ తెలుసు! ప్రయోజకుడయినా తన పెళ్ళాం, పిల్లలూ, యీ సంసారం యీదే సరికే తన బాధ్యతను పూర్తిగా నిర్వర్తించలేని అసమర్థుడు.

అయినా తండ్రి జీవితంలోనూ, ఉద్యోగంలోనూ, యింకా బ్రతికి వున్నాడు కాబట్టి సరిపోయింది. నిజానికి యీ వయసులో తండ్రి ఏమీ చేయలేడు ! తనే చేయవలసింది కాని చేయలేకపోతున్నాడు.

అదృష్టం బావుండి ఎలాగో ఒకలాగున యీ రోజుతో ఆ బరువు తీరిపోతుంది.

అంచేతనే అందిన జీతం రాళ్ళను చాలా జాగ్రత్తగా యివ్వవలసిన వాళ్ళకు, అందులో సగం, సగం యిచ్చి తృప్తి పరచి, కాస్త మిగిల్చి ఆ డబ్బుతో ఇది కొన్నాడు!

తన ఆనందాన్ని ఆ విధంగా తప్పితే, మరో విధంగా తెలియ పర్చలేడు!.....గబగబా యింటికి వచ్చేడు.

తీరా వచ్చేక భార్య ఎదురయింది! జ్ఞాపకం వున్నా ఏం లాభం ? భార్యకు వుత్తి చేతులే! త్రాసు మరి తూగలేదు అయినా భార్య పట్టించుకోదు ! ఫర్వాలేదు- ఆ సర్దుకుపోయే స్వభావమేగాని ఆమెకు లేకపోతే యిల్లు యీపాటికి నరకమయిపోను! ఆమె ఎంత మంచిది! అందరి కన్నా ఎక్కువగా సంతోషిస్తుంది సామ్రాజ్యం.

ఎలా బయటికి చెప్పాలా అని భయపడుతున్నా అతనికి యింట్లో వాతావరణం, నేయి చలన పందిళ్లు వేసినంత హాయిగా వుంది.

ఇంట్లో అందరూ అంత ఆనందంగా వుండడం, ఎన్నడూ చూసిన జ్ఞాపకం లేదు! ఆ యిల్లు ఎప్పుడయినా అంతకళకళలాడిందా? ఫ్రేము కట్టించకుండా పెట్టె అడుగున పడిపోయిన ఫొటోలో, ఎప్పుడో తీయించుకున్న తన పెళ్ళి ఫొటోలో, ముఖాలమీద వున్న నవ్వులను చూసి నెమరు వేసుకునేవాడు... మళ్లీ యీనాటికి ఆ నవ్వులు ముఖాలమీద వచ్చేయి... ఆ యింట్లో జీవచ్ఛవాలకు ప్రాణాలు వచ్చినట్లయింది!

ఏదీ చెల్లెమ్మ!

''అమ్మా! ఏదీ? ఉమ!''

''ఏం అన్నయ్యా!'' అని అంటూ నవ్వుకుంటూ గుర్రంలా పరుగెట్టి వచ్చింది- ఉమ- బంగారు కల! ఆ కలల్లోనే పాతికేళ్లు గడిపిన పిల్ల!

''ఈమేగాని, కలిగిన వాళ్ళ యిళ్లల్లో వుంటే?'' అని అనుకున్నాడు. మాసిన జాకెట్టు, చిరిగిన వోణీ, రిబ్బను కట్టుకున్న జడనూ చూసి -

అయినా ఆ రోజున ఆమె అందంగానే వుంది; ఆనందంగానే వుంది. విచారం కనబడనీయకుండా దాచుకొని, మబ్బు చాటున చందమామ లాంటి ఆమె ముఖం యీ రోజు వెలిగిపోతూంది!

''ఇదిగోనమ్మా చూడు! నీకేం తెచ్చానో!'' అన్నాడు నవ్వుతూ.

''నాకే! ఏదీ.. చూడనీ...'' అంటూ పేకెట్ విప్పింది ఉమ.

అందులో ఏముంది - పాము కుబుసం లాంటి తెల్లటి వాయిల్ చీరమీద ఆకుపచ్చని చిన్న పువ్వుల అద్దకం! ఉమ శరీరానికి అతికినట్టున్న చీర!.. సిగ్గుతో - ''ఎంత బాగుంది అన్నయ్యా!'' అంది.

తండ్రి కుటుంబరావూ, తల్లి శాంతమ్మ, సంతోషించారు. భార్య సామ్రాజ్యం ఈర్ష్య లేని మనసుతో ''పద కట్టుకుందువుగాని'' అని లోపలికి తీసుకు వెళ్లింది!

''మనకు తగ్గ సంబంధం! యింక ఆలోచించకుండా నిశ్చయించేసుకుని, అన్ని విషయాలూ మాట్లాడుకు రండి!'' అని శాంతమ్మ చెప్పింది.

గోవిందరావుగారు, మన సంబంధం తప్పకుండా చేసుకుంటానని అన్నాడు. అయినా మంచిది! నువ్వు చెప్పినట్లే నిర్ణయించుకొని వస్తాలే' అని అన్నాడు కుటుంబరావు!

★★★★

పాపారావుగారు పెరట్లో నిలబడి, ఎన్నాళ్ళ నుండో కలిసి పెరిగిన పచ్చని రెండు జంట చెట్లను- ఒకటి వుంచి రెండో దాన్ని నరికించే పనిని స్వయంగా చేయిస్తున్నాడు.

అతని యింటి వెనకాల బోలెడు పెరడు వుంది. అక్కడకు ఎవరినీ చేరనీడు. బీదా, సాదా, పాకలు వేసుకుని వుంటామన్నా తన నీడని బ్రతకనివ్వడు. ఆ నేల అంతా అలా బోడిగా, వృధాగా పడివుండవలసిందే గాని, ఉపయోగ పడనివ్వడు.

గాలికీ, ధూళికీ పెరిగిన చెట్లు కొన్ని వున్నాయి. అలా పెరిగి పెద్దవయిన వాటిల్లో ఒక వేప చెట్టొకటి, ఒక జామి చెట్టొకటి వున్నాయి. కాలం, కర్మం కూడి అవి రెండూ ఒకే దగ్గర మొలచి పెద్ద చెట్లు అయినాయి' అయితే చెట్లు పెద్దవయినా ఆ జామి చెట్టు మాత్రం కాపులేదు! కాయలేదు!

ఆ ఘోరం చూస్తూ ఎన్నాళ్లని సహించగలడు? పాపారావు! వృధాగా పెరిగిపోతున్న ఆ చెట్లనూ చూస్తూ తెలిసిన్నాళ్ళు వేచి చూశాడు. తనలాటి వాళ్ళను కారణం అడిగి చూశాడు.

ఎంతో మంది ఎన్నో రకాలుగా చెప్పేరు. నివారణోపాయాలూ కొందరు చెప్పేరు, కాని అతనికి అవి రుచించలేదు...కాని అతని తమ్ముడే ఒకడు - వేప చెట్టూ, జామి చెట్టూ కలిసి వున్నాయి కాబట్టి ఆ వేపచెట్టు, యీ జామి చెట్టును పెరగనివ్వడం లేదని, దాని బలం అంతా అది లాగేసుకుంటూoదని, అందువల్ల జామి చెట్టు కాపు పట్టడం లేదని, అందువల్ల ఏదో ఒక చెట్టు కొట్టి వేస్తేనే మిగలా చెట్టు కాస్తుందని చెప్పేడు.

ఆ సలహాను శిరోధార్యంగా చేసుకొని, ఆ వేప చెట్టును కొట్టి వేసే ప్రయత్నం చేస్తున్నాడు.

అట్లా పచ్చగా వున్న చెట్టును అందులోనూ వేపచెట్టును కొట్టించవద్దని ఎంతోమంది చెప్పేరు. ''వేస్తే వేప తీస్తే అమ్మవారు'' అని అంటారు. ఆ పని చేయవద్దని అన్నారు. కాని స్వార్థం కూడగట్టుకొని వున్న పాపారావు కదేం పట్టలేదు.

ఇంటివాళ్ళు కూడా చాలా చెప్పి చూశారు.

ఆ జామి చెట్టు కాయకపోతేనేం ? రెండూ రామలక్ష్మణుల్లా వున్నాయి. పచ్చగా వుండ నీయండి!'' అనీ-

''అట్లా రెండు చెట్లు జంటగా పుడితే - వాటికి పెళ్లి చేయాలిగాని విడదీయకూడదు.'' అని శతవిధాల చెప్పేరు కొందరు.

అయినా పాపారావు వినలేదు. వృధాగా ఆ చెట్లను ఎందుకు పెరగనివ్వాలి ? వేపచెట్టును తీసివేస్తే జామి చెట్టు కాస్తుంది. ఆ పళ్ళు అమ్ముకొని డబ్బు చేసుకోవచ్చు. వేపచెట్టు వుండి వొరగేదేమిటి? అని వాదించి ఆఖరికి ఆ వేప చెట్టును కొట్టి వేయడానికే నిశ్చయించాడు.

అతని మొండి పట్టుదలకు, ఇరుగు పొరుగు వాళ్ళూ, యింట్లో వాళ్ళూ కూడా ముక్కుమీద వేలుంచుకున్నారు.

ఇంతలో శేషాచలం అక్కడకు వచ్చాడు.

''అయ్యా పాపారావుగారు!'' అని సవినయంగా అన్నాడు చేతులు నలుపుకుంటూ.

''ఓహో శేషాచలం గారా ? వెళ్లినపని అయినట్టేనా ?'' అని అడిగాడు.

ఎంతమాట! మీ ప్రయత్నం, నా రాయభారం వృధాపోదండి ? ఆ కృష్ణ రాయభారం వృధ అయితే అయింది గాని... మనది అలా కానిస్తానా ?'' అన్నాడు.

'' ఆఖరికి ఎంతకు సెటిల్ అయినట్టు!''

''మరో అయిదు వందలు అనేసరికి ఎగిరిగెంతేసి మరీ ఒప్పుకున్నారు!''

''ఒప్పుకోక ఉద్ధరిస్తారా ? ఏమిటి? ఏం చూసుకొని ఎగురుతారు ? - మనం పోటీకి వెళ్ళకపోతే ఆ రెండువేలయినా వచ్చి వుండేవి కాదు!''

''అవుననుకోండి - అయినా ఎన్ని మాటలన్నారని ! .. శివశివా. యీ నోటితో చెప్పలేను!''

''ఏమన్నారేమిటి ?''

''ఇంతకు పూర్వం మీ వద్దకు వాళ్ళే వచ్చారటగా ? వాళ్ళ అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకోమని!''

'' అయితే''

''అప్పుడు - నా తాహతెక్కడ ? మీ'తాహతెక్కడ ?.. ఎన్ని గుండెలుండి నాతో సంబంధం చేయడానికి వచ్చారు ?'' అని మీరన్నారుట ! అందుకని, యిప్పుడు ఏ మొహం పెట్టుకు వచ్చాడు ? యిప్పుడు మేం తగుతామా ?'' అని ముదరకించారు.

''ఏడిశారులే! ఈపాటి వాళ్ళు దొరకబోరనా ? యిదంతా దేనికో నీకు చెప్పేను కదా!''

'' చిత్తం .. చిత్తం ...'' అని శేషాచలం అంటూండగానే -

ఫెళ్ళున వేపచెట్టు పెద్ద శబ్దంతో విరిగి పడిపోయింది.

పాపారావు మీసం మీద చేయి తిరిగింది.

''యిహ మెరూ మీరూ మాట్లాడుకొని నిర్ణయించుకోవడమే తరువాయి'' అని శేషాచలం అన్నాడు.

''అదెంతసేపు ? ఆ వ్యవహారం నే చూసుకుంటా లెండి!''

''చిత్తం... మళ్ళీ కలియమంటారా ?'' అని నసుగుతూ అన్నాడు . అది గ్రహించి-

'' ఓ.. అదా.. అట్లాగే అనుకున్నది కాస్తా జరిగిపోనీండి. మీ సహాయం మరిచిపోను..:'' అని పాపారావు అనగానే శేషాచలం వెళ్ళిపోయాడు.

ఆ వ్యవహారం సంగతి చూడడానికి పాపారావు కూడా బయలుదేరాడు.

★★★

తన దగ్గర ఉన్న ఒక్క పశువునూ సంతలో బేరానికి పెట్టేడు - గోవిందరావు. ఇన్నాళ్లు పెంచినా తిండి పుష్టేగాని, ఉపయోగం లేని ఆ పశువు వల్ల కాస్తయినా రాబడదామని అతడి ఊహ.

ఎన్ని సంతలకో త్రిప్పి త్రిప్పి బేరం రాక ఆఖరికి యీ సంతలో పలికిన రేటుకు తృప్తి చెందాడు!

ఆ ఆసామీ కొంత మొత్తాన్ని ఎడ్వాన్సుగా యిచ్చి, మిగతా డబ్బు తీసుకు వచ్చి ఆ గొడ్డును తోలుకు వెళతానని చెప్పి వెళ్ళేడు.

ఆ ఆసామీ వెళ్లిన కొద్ది సేపటిలోనే మరో వ్యక్తి వచ్చి, కంటికి నదురుగా వున్న ఆ గొడ్డునే అడిగేడు.

ఇప్పుడే అయిదు వందలకు ఒకరు అడిగి, పాతిక రూపాయిలు ఎడ్వాన్సు యిచ్చి వెళ్లారండి!

నాకిష్టం లేదు. (తిప్పి యిచ్చేద్దామని చూస్తున్నాను!'' అని అన్నాడు గోవిందరావు. బేరం అయిపోయిందన్న నిజాయితీ అయినా లేకుండా.

''ఆ అయిదు వందలూ, ఆ పాలికా కూడా యిస్తాం. మీకు ఇష్టమయితే బేరం (తిప్పండి!'' అని అడిగేడా మహానుభావుడు. ఒకరు అడిగి బేరం చేసుకొని బజానా యిచ్చిన దానిని మనం ఎలా పోటీపడి కొంటాం!'' అన్న నీతి, నిజాయితీ అయినా లేకుండా -

అదే చాలని కక్కుర్తిపడి స్వార్థానికి లొంగిపోయి - మొదటి వాడికి నామాలు పెట్టి, రెండో వాడికే యిచ్చేశాడు గోవిందరావు.

ఎవరు ఎక్కువ యిస్తే వారి వెనకనే నడిచిపోయింది ఆ పశువు!...

★★★★

గోవిందరావు యింటికి రాగానే..

అతని రాకకు ఎదురు చూస్తూ పాపారావు సిద్ధంగా కూర్చుని వున్నాడు.

పశువును అమ్మగా వచ్చిన డబ్బును లెక్క చూసుకుంటూ -

''ఏమండీ పాపారావు గారూ ! యిలా దయ చేశారు!'' అని లౌక్యంగా అడిగేడు. ఏమీ ఎరగనట్టు గోవిందరావు -

''అబ్బే ఏం లేదు.... శేషాచలం అంతా చెప్పే వుంటాడు. ఆమాట మీనోటంట వినిపోదామని!'' అని అన్నాడు.

''శేషాచలం గారితో మేం చెప్పిన మాట మీకిష్టం అయితే మాకేం అభ్యంతరం లేదు!''

''అయితే మరి ముహూర్తాలు పెట్టిద్దామా ?''

''శుభం''

అప్పుడే గుమ్మంలో అడుగు పెట్టిన కుటుంబరావు యీ మాటలు విని నిలువునా నీరయి పోయాడు.. తనతో సంబంధం చేసుకుంటానని మాట ఇచ్చినగోవిందరావు, యిలా మాట తిప్పి, పాపారావుతో సంబంధం చేసుకుంటాడని అనుకోలేదు... అంత షరకూ వచ్చిన వాడు; ఆ మాటలు విన్నాక మరి ఆ గోవిందరావు ముఖం చూడడానికి అసహ్యం వేసింది.

ఒకరు స్థిపరచుకున్న సంబంధానికి పోటీపడి, ఆ సంబంధాన్ని తనవయిపుకు తిప్పుకొన్న, పాపాత్ముడు పాపారావుని పలుకరించాలనిపించలేదు.

వైనక్కు తిరిగి పుట్టెడు దుఃఖంతో వెళ్లిపోయాడు -

★ ★ ★

పాపారావు గారి యింటి ముంగల పెళ్ళి తోరణాలు వెలిశాయి. ఆ సంగతి తెలిసిన కుటుంబరావు యింటిలో అందరూ కృంగిపోయారు.

పెళ్ళి వారింటిలో అందరి మొహాల్లోనూ సంతోషం వెల్లి విరిస్తే కుటుంబరావు యింట్లో అందరిలోనూ విచారం పెల్లుబికింది.

''దగ్గరవాడూ, కావలసినవాడూ, అయిన పాపారావు యింత మోసానికి దిగుతాడని

అనుకోలేదు.... నేను మాటాడిన సంబంధానికే పోటీ వస్తాడా ?... ఛీ యింత నీచుడని అనుకోలేదు..'' అని వాపోయేడు కుటుంబరావు.

''ఏదో మనకు తగ్గ సంబంధం చేసుకుందామనుకున్నాం.. పెద్ద ఆస్థి లేకపోయినా, ఎక్కువ కట్నం యిచ్చుకోలేక, దానికి ఆశపడ్డాం... అయిపోతుందనీ అనుకున్నాం.. కాని యీ చిన్న సంబంధానికే పోటీ రావడానికి, వాళ్లకేం ఖర్మ పట్టిందో ! అర్థం కాలేదు. డబ్బున్న వాళ్ళు యింత చిన్న సంబంధం వయిపు రారనుకున్నాను !'' అని విచారించింది శాంతమ్మ.

''అబ్బ..బ్బ.. ఎన్ని సంబంధాలు.. ఎన్ని సంబంధాలు. విసుగెత్తిపోతున్నాను. .. ఒక్కటీ కుదరదు గదా.. అయిపోతుంది. అయిపోతుంది అనుకోవడం - తీరా ఏ పాడు వెధవలో వచ్చి పాడు చేయడమూ.. అయినా మన పిల్లకి అదృష్టం వుండొద్దూ.... యీ దరిద్రపు మొహాన్ని... ఎవరు చూసినా, వెనక్కు తిరిగి పోతున్నారు ! యింక దీని రాత యింతే - దీనికి మరీ జన్మలో పెళ్ళికాదు..... మన గుండెల మీద కుంపటి దిగదు ! .. యిక యీ బాధ భరించలేను. ఏ విషమో తిని అందరం చస్తే పీడ వదలిపోతుంది'' అని కుటుంబరావు నిరాశతో ఏం చేయలేక, విసుగుతో, చికాకుతో కోపం పట్టలేక అనేశాడు.

యీ మాటలు లోనుండి విన్నది ఉమ. ప్రొద్దుటే ఉదయించిన ఉత్సాహము, ఆనందం ఎంతలో మాయమయినాయి ? తల తీసినంత అవమానం కలిగింది ! హృదయం కృంగిపోయింది. ఆఖరికి తన తల్లితండ్రులకు కూడా ఎంత బరువయిపోయింది ? తన నుండేకదా యీ విచారం !... లేకపోతే అందరి లాగే కలో గంజో త్రాగుతూ, యీ మనోవ్యాధి లేకుండా బ్రతుకుదురు ! .. తన నుండే యీ యింట్లో సుఖ శాంతులు లేకుండా పోయినాయి. తన నుండి అన్నావదినలు కూడా సుఖంగా వుండలేకపోతున్నారు.. తల్లిదండ్రులకు మనశ్శాంతి లేకుండా పోతూంది !

పెళ్ళి కాలేదన్న చింత తనకు లేకపోయినా,... యింట్లో వాళ్ళూ, బయటివాళ్ళూ అలా వూరుకోలేదే!.. ఎక్కడకు వెళ్ళినా తల్లి తండ్రులను, ఇదే ప్రశ్న వేస్తారు ! వాళ్ళ గౌరవ మర్యాదలు తన పెళ్ళి తోనే ముడిపడి వున్నాయంటారు. సంఘానికి యీ బాధ పట్టుకున్నది !

అలా అన్న పెద్దలెవ్వరూ పెళ్ళి చేయలేరు ! కట్నం లేకుండా పెళ్ళాడుతామని ఎవరూ ముందుకు రారు !... పెళ్ళి ఎందుకు చేయలేదని అడిగేవారే గాని , అది ఎందుకు జరగలేదో, దాని వెనుక వున్న సమస్యలకు పరిష్కారం ఏమిటో చెప్పరు.

ఇంట్లో వారిచేత, లోకంలో మనుష్యుల చేత ఎన్నాళ్ళిలా, అవమానం పొందుతూ బ్రతకగలదు?

తన నుండి ఎవరికీ ఏ విధమయిన కష్టమూ వుండకూడదు... బ్రతికినంతకాలం, బరువయి బ్రతక కూడదు ! అని నిశ్చయించుకుంది.

★★★★

దూరంగా సోమారావు గారింట్లో పెళ్ళి బాజాలు వినబడుతున్నాయి. కుటుంబరావు ఇంట్లో అందరూ ఏదో పోయినట్లు విచారంగా వున్నారు. ఎవరి ముఖాల్లోను కళాకాంతులు లేవు.

కర్తవ్యం, నిర్ణయించుకున్నా తల్లి తండ్రులను తలుచుకొని, మనస్సుని రాయి

చూసుకోలేకపోతూంది.. ఉమ.

వంటింట్లో తల్లి ఏడుస్తూ కనబడింది. ఉమని చూసి-బయటకు కనబడకుండా మొఖం ప్రక్కకు త్రిప్పుకొని కళ్ళు తుడుచుకుంది.

యీ ముహూర్తానికే తన పెళ్ళి జరగవలసింది... అది ఆగిపోయి పాపారావు గారింట్లో జరుగుతూంది. అందుకే ఆమె దుఃఖం అని వేరే అడగడం ఎందుకు ?

తండ్రి మంచం మీద కూర్చుని నెత్తి మీద చేతులేసుకొని ఉసూరు మంటున్నాడు.... అదీ తన పెళ్ళి తప్పిపోయిందనే కదా !

అన్నయ్య గదిలోనూ, వదిన భయం భయంగానూ గట్టిగా మాట్లాడుకోనయినాలేదు! ఇదంతా ఎందుకు ? తనకు పెళ్ళి జరగడంలేదనే! ఈ నరకమంతా తనమూలంగానే.. యింక ఆలశ్యం చేయకూడదు. అని అనుకొని ధైర్యం తెచ్చుకుంది.

ఇంటి ముందునుండి పెండ్లి ఊరేగింపు మహా వైభవంగా సాగిపోతూంది. కిటికీ పూచల మధ్య నుండి.. ఎవరికీ కనబడకుండా... పెళ్లికూతుర్ని పెళ్ళి కుమారుణ్ణి చూసి... ఉమ ... అట్లాగే వుండిపోయింది.

అప్రయత్నంగా కళ్ళంట నీళ్ళు తిరిగాయి.. అవి ఆనంద భాష్పాలో ? దుఃఖాశ్రువులో !...

ఆ ముహూర్తానికి తనకు కాకపోయినా... మరొక కన్యకయినా పెళ్లి జరుగుతూంది... ముహూర్తాలు మాత్రం వృధా కావు.. అదృష్టవంతులు. దంపతులవుతారు - తనలాటి దురదృష్టవంతులకు ఆ శుభముహూర్తం మరి రాదేమో? అని అనుకుంది.

ఆ మర్నాడు ... మరి... ఉమ.. లేదు...

బదులుగా టేబిలు మీద ఒక ఉత్తరం.. వుంది. అంతే...

ఆ వుత్తరంలో ఏముంటేనేం ?...

అందరి సమస్యా.. ఒక్క ఏడుపుతో తీరిపోతుంది.

పాపారావుగారింట్లో పెళ్ళి ఆగలేదు. గోవిందరావుగారు విడిదిలో కూర్చుని, బ్రతిమాలించుకుని మరీ లాంఛనాలూ మర్యాదలూ జరిపించుకుంటున్నారు. !

ఎవరు కట్నం ఎక్కువ ఇస్తే వారి పిల్ల మెడలో తాళి కట్టడానికి అభ్యంతరం లేని పెళ్లి కొడుకు వుస్తే కట్టడం మానలేదు !

క్రితం రోజు ఆనందం.. యీనాడు కుటుంబరావు ఇంట్లో లేదు !

మబ్బులువేసి, మంచు కురిసి - గున్న మామిడి చెట్టు పూత మాడిపోయింది ! గాలివాన వచ్చి ఆ పూత రాలిపోయింది.

వెతికి, వెతికి, ప్రయోజనం లేక పురుషోత్తమరావు నిరాశతో యింట్లో ప్రవేశించాడు... అతని ముఖం చూడగానే సామ్రాజ్యం గ్రహించి తలవంచుకుంది - కుటుంబరావూ, శాంతమ్మా, యీ ప్రపంచమే మరచి దుఃఖ సముద్రంలో మునిగి పోయారు.

ఆయింట్లో కళకళలాడుతూ తిరిగే... ఉమ.. లేదు !

''ఉమ ఏమయింది ?''

కట్నాలు తీసుకుని పెళ్ళి చేసుకొనే పెళ్ళి కొడుకులూ - ఆ కట్నం కోసం కన్న కొడుకులను నేలం పాడే పెద్దలూ దీనికి సమాధానం చెప్పరు!

'ఉమ' లా పెళ్లి కాకుండా అందరికీ బరువయిపోయిన ఆడపిల్లలూ కట్నాలు యివ్వుకోలేని తల్లి తండ్రులూ చెప్పగలరేమో! ఉమ ఏమయిందీ ?

★ ★ ★ (- అముద్రితం)